క్లుప్తంగా

అంతర్గత రోడ్లను బాగు చేయాలి



మాగనూర్: మండల పరిధిలోని వర్కూర్ గ్రామంలోని పలు అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. చిన్న పాటి వర్షానికే ఆయా కాలనీల్లోని ప్రధాన రోడ్లు బురదమయంగా మారుతుండడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతల, బురద రోడ్లపై ప్రయాణం తమకు ఇంకా ఎన్ని రోజులు అని ప్రశ్నిస్తున్నారు. వర్షం కురిస్తే చాలు ఏ గుంత ఎక్కడ ఉందో గుర్తించలేక జారిపడిన ఘటనలు అనేకం ఉన్నాయని, సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పాఠశాలలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు



ధన్వాడ: మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం జేవైఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. నిర్వాహకులు సునీల్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ప్లాంట్‌ను ప్రారంభించి విద్యార్థులకు తాగునీరు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలలోనే ఉంటూ విద్యను అభ్యసిస్తున్నారని వారి ఆరోగ్యం కోసం ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచు శ్రీనివాసులు, మాజీ ఎంపిటిసి కడపయ్య, బోయ కృష్ణయ్య, రాఘవేందర్‌రెడ్డి, ఈశ్వరయ్య, ఎలుక బాలరాజు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



కోస్గి/ధన్వాడ: వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) పాలక వర్గాల పదవీ కాలం మరో మారు పొడిగించడంతో శుక్రవారం పీఏసీఎస్ పాలకవర్గం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పాలకవర్గాల పదవీకాలం ఈ నెల 14తో ముగియడంతో మరోమారు పదవీకాలం పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డితోపాటు పాలకవర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు.

చిట్టెం నర్సిరెడ్డికి ఘన నివాళి



నారాయణపేట/ధన్వాడ/మక్తల్: మావోయిస్టుల చేతిలో హత్యకు గురైన మాజీ ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయనకు నివాళులు అర్పించారు. మంత్రి వాకిటి శ్రీహరి, మక్తల్ మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ శివకుమార్‌రెడ్డి వేర్వేరుగా పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడి పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మూడు పార్టీలు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు ప్రజాప్రతినిధులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో మహాయజ్ఞం

ఊట్కూరు: మండలంలోని ఆర్యసమాజ్ భవనంలో శుక్రవారం యజుర్వేదపారాయణ మహాయజ్ఞాన్ని నిర్వహించారు. అనంతరం పండిట్ ప్రియదత్తు శాస్త్రీ ప్రవచనాలు చేపట్టారు. తర్వాత భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో కనకప్పఆర్య, భీంరాజు, అనీల్‌కుమార్, శ్రీకాంత్, నర్సింహులు గౌడ్ ఆర్య, పవన్‌కుమార్, గొల్లదివాకర్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



కోస్గిలో దేశ నాయకుల వేషధారణలో చిన్నారులు



మాగనూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..



నర్వలోని సీపూర్ ప్రాథమిక పాఠశాలలో..

మురిసిన మువ్వన్నెల జెండా



నారాయణపేటలో ఆకట్టుకున్న ప్రభాతభేరి



ధన్వాడ తహసీల్దార్ కార్యాలయంలో జెండాను ఎగురవేస్తున్న తహసీల్దార్ సింధుజా

సాక్షి నెట్‌వర్క్: భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఊరూరా జాతీయ జెండావిష్కరణ పండుగ ఘనంగా జరిగింది. వేడుకల్లో భాగంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు.

- నారాయణపేటలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు జాతీయపతాకం ఎగరవేశారు. పట్టణ పురవీధుల గుండా విద్యార్థులు ప్రభాతభేరి నిర్వహించారు.
- కోస్గిలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో జెండా ఆవిష్కరణ చేశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు దేశ నాయకుల వేషధారణలో ఆకట్టుకున్నారు.
- మాగనూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో, వెటర్నరీ, సింగిల్ విండో కార్యాలయం, గ్రంథాలయం, ప్రభుత్వ వసతి గృహాలతో పాటు విద్యార్థి సంఘాలు, ఆయా రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.
- ఊట్కూరులోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జెండాను ఎగురవేసి జాతీయ గీతం ఆలపించారు.
- నర్వలో పాఠశాలల్లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. విద్యార్థులకు, చిన్నారులకు, గ్రామస్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు.
- మరికల్‌లో విద్యార్థులు ప్రభాత్ బేరి నిర్వహించి జెండా పండుగను జరుపుకున్నారు.
- కొత్తపల్లిలో విద్యార్థులు అమరులైన నాయకులను స్మరిస్తూ పుర వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు.
- ధన్వాడలో ప్రజాప్రతినిధులు జెండాను ఎగురవేయగా విద్యాసంస్థలలో ప్రిన్సిపల్, హెచ్ఎంలు, జెండాను ఆవిష్కరించారు.
- మక్తల్ పోలీస్‌స్టేషన్ వద్ద సీఐ రాంలాల్, మక్తల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ కాలేజీ ముందు ప్రిన్సిపాల్ దత్తు , బాలుర ఉన్నత పాఠశాల వద్ద అనిల్‌గౌడ్, తహసీల్దార్ కార్యాలయంలో మువ్వన్నెల జండాను ఎగురవేశారు.
- మద్దూరులోని మున్సిపల్ కార్యలయం దగ్గర పుర కమిషనర్ శ్రీకాంత్ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు.
- కృష్ణాలోని అన్ని గ్రామాల్లో అధికారులు జాతీయ జెండాలను ఎగురవేశారు.
- దామరగిద్దలో పద్మశ్రీ అవార్డు గ్రహీత దాసరి కొండప్ప అమృత్ సరోవర్ ఖాన్ చెరువు గట్టుపై జెండా ఎగురవేశారు.



మక్తల్‌లో జెండా వందనం వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి



దామరగిద్దలో విన్యాసాలు చేస్తున్న విద్యార్థినులు



కృష్ణా తహసీల్దార్ కార్యాలయంలో..



మరికల్ బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న జీహెచ్ఎం నాగరత్నమ్మ



జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

జాజాపూర్ విద్యార్థుల ప్రతిభ



నారాయణపేట రూరల్: మండలంలోని జాజాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభ అందరిని ఆకట్టుకుంది. వారు తయారు చేసిన జాతి రత్నాల చిత్రపటాలు ఎంతో ఆకర్షణీయంగా నిలిచాయి. ఇటీవల మన ఊరు–మనబడి పథకం కింద వచ్చిన పెయింటింగ్ డబ్బాల మూతలు వృధాగా ఉంటే వాటిని సేకరించి చక్కగా అలంకరణ చేసి అందులో జాతీయ నాయకుల చిత్రపటాలను పొందుపరిచారు. వీటిని శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో వాటిని ప్లకార్డులుగా పట్టుకుని ప్రదర్శించారు. అతి తక్కువ ఖర్చుతో చేయడమే కాకుండా బాల్యం నుండే విద్యార్థుల మదిలో స్వాతంత్ర సమరయోధులను ముద్రించడం ఎంతో అభినందనీయమని విద్యార్థుల ప్రతిభను గ్రామస్తులు కొనియాడారు.

'పేట' ఏడీసీకి మెంటార్ అవార్డు

నారాయణపేట రూరల్: ఆర్టీసీలో కొత్తగా ప్రవేశపెట్టిన మెంటార్ అవార్డును ఉమ్మడి జిల్లాలో నారాయణపేట డిపోకు చెందిన ఏడీసీ అర్కంచి రవికుమార్‌కు లభించింది. ప్రతీ డిపోలో తక్కువ టార్గెట్‌లు వస్తున్న సర్వీసులకు సంబంధించి ఏడీసీలను ఇంచార్జిలుగా నియమించి ఆయా రూట్‌లలో వెళ్లే కండక్టర్‌లకు కౌన్సిలింగ్ ఇచ్చి వాటి ఆదాయం పెంచే ప్రయత్నం చేయడం దీని లక్ష్యం. ఈ క్రమంలో రవికుమార్ ప్రయత్నంతో మూడు నెలల కాలంలో సర్వీసు కలెక్షన్‌ల విషయంలో స్థానిక డిపోలోని మద్దూర్ కోస్గి రూట్ సర్వీసు ఆదాయం పెరిగింది. ఉమ్మడి జిల్లాలోని అన్ని సర్వీసులతో పోలిస్తే ఈ రూట్ సరాసరి ఆదాయం ఎక్కువ ఉండటంతో దీనికి కృషి చేసిన ఏడీసీ అర్కంచి రవికుమార్‌ను శుక్రవారం మహబూబ్‌నగర్‌లో ఆర్ఎం సంతోష్ కుమార్, డిప్యూటీ ఆర్ఎం లక్ష్మీధర్మా ప్రశంసాపత్రం అందించి అభినందించారు.



నేటి నుంచి వేణుగోపాలస్వామి ఉత్సవాలు

నర్వ: పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో శనివారం నుంచి శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గోకుల్‌సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారికి నాలుగు రోజుల పాటు ఉత్సవాలను అంగరంగా వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి రోజు శనివారం కార్యక్రమాలకు గోపూజతో అంకురార్పణ, రెండో రోజు ఆదివారం ఉదయం సుప్రాభాతం, మేల్కొలుపు, అభిషేకం, మద్యాహ్నం భక్తులకు అన్న ప్రసాద వితరణ, సాయంత్రం పాల ఉట్ల కార్యక్రమం, అనంతరం పల్లకి సేవ, రథోత్సవం కార్యక్రమాలుంటాయన్నారు. ఉత్సవాలకు భక్తులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని అలయ కమిటీ సభ్యులు కోరారు.



ఉత్సవాలకు ముస్తాబైన వేణుగోపాల స్వామి ఆలయం

నేడు ఆంజనేయస్వామి శోభాయాత్ర

మద్దూరు: మండల కేంద్రంలోని పాతబస్టాండ్ ఆంజనేయస్వామి ఉత్సవాలు శనివారం నిర్వహించనున్నట్లు అలయ కమిటీ అధ్యక్షుడు ముష్టి నర్సిములు శుక్రవారం తెలిపారు. ఉదయం జల్ది ఉరేగింపులో హనుమాన్ శోభాయాత్ర ఉంటుందని తెలిపారు. ఈ యాత్రంలో పాల్గొనే ప్రతి ఒక్కరికి టోపి, హనుమాన్ జెండా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. శోభాయాత్ర అనంతరం స్వామిక అభిషేకానంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. అలాగే రెటపట్ల కార్యక్రమం, రాత్రికి ఉట్టి కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలి

నారాయణపేట రూరల్: జిల్లాలోని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సంఘంలో సభ్యత్వం కలిగిన జర్నలిస్టులకు శుక్రవారం గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ చేతుల మీదుగా యూనియన్ నాయకులు ఆవిష్కరింపజేసి విలేకరులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం జర్నలిస్టులు పాటుపడాలని, నీతి నిజాయితీగా వార్తలు ప్రచురించాలని సూచించారు. ప్రభుత్వానికి ప్రజలకు వారదులుగా ఉంటూ చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎండి రియాజ్ హాల్ హక్, డీఎస్పీ నల్లపు లింగయ్య, సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, జిల్లా ఎడ్యుకేషన్ కన్వీనర్ రాజేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



టీయూడబ్ల్యూజే సభ్యులతో ఎస్పీ యోగేష్ గౌతమ్

విద్యార్థికి నగదు పురస్కారం అందజేత

ఊట్కూరు/ధన్వాడ: స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా నారాయణపేటలోని పేరెడ్ గ్రౌండ్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పెద్దజట్రం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి బాలకృష్ణ పదో తరగతిలో మంచి మార్కులు సాధిదంచి జిల్లాలోనే ద్వితీయ స్థానంలో నిలవడంతో మంత్రి వాకిటి శ్రీహరి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ రూ.10వేలు నగదు ప్రశంసా పత్రాన్ని బహుకరించారు. అలాగే ధన్వాడకు చెందిన రేణుక మండల టాపర్‌గా నిలవడంతో మాజీ వైస్ ఎంపీపీ ఉదయభాను, మాజీ సర్పంచు అరుణ రూ.10వేలు నగదు అందజేసి మంచి మనసు చాటుకున్నారు.

ప్రహరీ కూలి.. ప్రమాదకరంగా మారి



మాగనూర్ మండలంలో ఓ పురాతన బావి ప్రమాదకరంగా మారింది. కొత్తపల్లి గ్రామంలోని ఇళ్ల మధ్యలో ఉన్న ఈ బావిని చూసి గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. పూర్వం తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన ఈ బావి ప్రస్తుతం ఇంటింటికీ నల్లాలు రావడంతో నిరుపయోగంగా మారింది. బావి శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రమాదం జరగకుండా తాత్కాలింగా గోడ ఏర్పాటు చేశారు. అయితే వర్షాలకు ఇటీవల గోడ కూలిపోయింది. అధికారులు స్పందించి బావిని పూడ్చి వేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. - మాగనూర్

ఎంపీ, ఎమ్మెల్యేకు ఆహ్వానం

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలో శనివారం జరిగే శ్రీ కృష్ణాష్టమి వేడుకలకు హాజరు కావాలని ఎంపీ డీకే అరుణ అలాగే ఎమ్మెల్యే పర్ణికారెడ్డికి ఆహ్వాన పత్రం అందజేశారు. రాధా కృష్ణ దేవాలయంలో అత్యంత వైభవంగా జరిగే శ్రీ కృష్ణాష్టమి వేడుకలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించాలన్నారు. అదే విధంగా ఉట్టి కొట్టే కార్యక్రమంలో కూడా పాల్గొనాలని దేవాలయ సభ్యులు కోరారు.

రైతులకు న్యాయమైన పరిహారం అందించాలి



దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తి గ్రామంలో పేట కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు శుక్రవారం భీష్మ రాజ్ ఫౌండేషన్ చైర్మన్ రాజ్‌కుమార్ రెడ్డి సభ్యులు మద్దతు తెలిపారు. దీక్ష శిబిరంలో మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు న్యాయమైన పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. ప్రాజెక్టును స్వాగతిస్తూ పరిహారం మాత్రమే పెంచమంటున్న రైతుల పోరాటన్ని గుర్తించి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో భీష్మ రాజ్ పౌండేషన్ సభ్యులు, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

గండి పడకుండా ముందస్తు చర్యలు



నారాయణపేట రూరల్: మండలంలోని బైరం కొండ గ్రామ శివారులోని చెరువుకు గండి పడకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు చెరువు నిండి అలుగు పారుతుంది. గ్రామం వైపు ఉన్న కరకట్ట తెగి నీరు వీధుల్లోకి రాకుండా అధికారులు మట్టిని తరలించి ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో మండల పరిషత్, ఇరిగేషన్, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

ధ్వంసమైన వంతెనను పునః నిర్మించాలి

కొత్తపల్లి: మండలంలో గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో తెగిపోయిన తాత్కాలిక వంతెనను పునః నిర్మించాలని మండలవాసులు కోరుతున్నారు. కొత్తపల్లి–భూనీడు మధ్య వాగులో వేసిన తాత్కాలిక వంతెన తెగిపోయి రెండు రోజులుగా ఇరు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో వంతెనను తహసీల్దార్ జయరాములు పరిశీలించారు. ప్రయాణికుల అవసరాలను గుర్తించి వంతెన నిర్మాణం త్వరితగతిన చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. వాగులో నీటి ఉధృతి తగ్గగానే వంతెన నిర్మాణం చేపట్టాలన్నారు. కార్యక్రమంలోఎంపీడీఓ కృష్ణారావ్, ఎంఆర్ఐ శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ధ్వంసమైన వంతెనను పరిశీలిస్తున్న తహసీల్దార్ జయరాములు, అధికారులు

డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

నారాయణపేట టౌన్: తుఫాన్ డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షుడు కాశీనాథ్ కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని స్థానిక భగత్‌సింగ్ భవన్‌లో నిర్వహించిన తుఫాన్ మరియు కార్ డ్రైవర్ల జిల్లా జనరల్ బాడీ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం 2019లో రోడ్డు సేఫ్టీ బిల్లును తీసుకొచ్చిందని దాని వల్ల డ్రైవర్లకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. అనుకోకుండా సిగ్నల్ జంప్ అయినా, ప్రత్యేక పరిస్థితులలో రాంగ్ రూట్లో ప్రయాణించిన జరిమాణాలు విధిస్తున్నారని అదే విధంగా ఏ ఇతర చిన్న వాహనాలు వచ్చి పెద్ద వాహనాలను ఢీకొని ప్రమాదం జరిగినా వీరి తప్పు లేకున్నా డ్రైవర్లకు రూ.10వేల జరిమాణాతో పాటు ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తున్నారన్నారు. కావునా రోడ్డు సేఫ్టీ బిల్లులో మార్పులు చేయాలన్నారు.కార్యక్రమంలో తుఫాన్ మరియు కార్ డ్రైవర్ల యూనియాన్ జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య, కార్యదర్శి బాలకృష్ణ, సహాయ కార్యదర్శి సంతోష్, కోశాధికారి అంజి తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పశు వైద్యాలయం

మరికల్: మండల కేంద్రంలో ఉన్న పశు వైద్య కేంద్రం శిథిలావస్థకు చేరుకుంది. గోడలు నెర్రేలు ఇచ్చి ప్రమాదకరంగా మారింది. వర్షాకాలంలో చిన్న పాటి వర్షం కురిసిన చాలు పైకప్పు నుంచి నీళ్లు కారుతుండడంతో నీటిని ఎత్తి వేయాల్సిన పరిస్థితి నెలకొంది. భారీ వర్షాలు కురిస్తే భవనం కూలిపోయే అవకాశం లేకపోలేదని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకముందే శిథిలావస్థకు చేరిన భవనాన్ని తొలగించి కొత్త భవనం నిర్మించేలా ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



జిల్లా జాగృతి అధ్యక్షుడిగా గవినోళ్ల శ్రీనివాస్

నారాయణపేట టౌన్: రాష్ట్ర జాగృతి కమిటీల నియామకంలో భాగంగా జాగృతి అధ్యక్షురాలైన కల్వకుంట్ల కవిత నారాయణపేట జిల్లా నూతన జాగృతి అధ్యక్షుడిగా దామరగిద్ద మండలంలోని బాపన్‌పల్లికి చెందిన గవినోళ్ల శ్రీనివాస్‌ను నియమించారు. ఈయన పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నందువల్ల ఆయనను నియమిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా తనను నమ్మి అధ్యక్షుడిగా నియమించినా కవిత గారికి శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు. ఈయన ఎంపిక పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

పెయింటింగ్స్ వర్కర్స్ జిల్లా కమిటీ ఎన్నిక



నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని స్థానిక గజలమ్మ దేవాలయం దగ్గర పెయింటర్స్ జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడుగా రామ్‌రెడ్డి, కార్యదర్శిగా అంబదాస్, ఉపాధ్యక్షుడుగా నరసింహ ఎన్నికయ్యారు. భవన మరియు ఇతర నిర్మాణ పనులలో పని చేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా వచ్చే నిధులను వెంబడే మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులతో పాటు టీయూసీఐ నాయకులు పాల్గొన్నారు.

అమరచింత ఎస్ఐగా స్వాతి

అమరచింత: మండల నూతన ఎస్ఐగా ఎం.స్వాతి శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈమె జోగులాంబ గద్వాల పోలీసు కార్యాలయంలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ అమరచింత ఎస్ఐగా బదిలీపై వచ్చారు. ఈ మేరకు ఎస్ఐ స్వాతి ఎస్పీ రావుల గిరిధర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా శాంతి భద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు.